క్లుప్తంగా

పంటల వివరాలు సేకరణ



పంట వివరాలు నమోదు చేస్తున్న ఏఈఓలు

శివ్వంపేట(నర్సాపూర్): వడగాళ్ల వానకు పాడై పోయిన పంటలను సోమవారం వ్యవసాయ సిబ్బంది పరిశీలించారు. ఏఈఓలు వినీత, వెన్నెల మండలంలోని పిల్లుట్ల, లింగోజిగూడ గ్రామాల్లో పంటలు నష్టపోయిన రైతుల వివరాలు నమోదు చేశారు. ఆకాల వర్షంతో చేతికి వచ్చిన పంట చేజారిపోవడంతో తీవ్రంగా నష్ట పోవాల్సి వచ్చిందని తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరారు.

టీకాలు తప్పనిసరి



చిలప్‌చెడ్‌లో పశువుకు గాలికుంటు టీకా వేస్తున్న పశువైద్యాధికారి వినోద్

చిలప్‌చెడ్(నర్సాపూర్): పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయాలని వెటర్నరీ సర్జన్ డా వినోద్ అన్నారు. సోమవారం ఆయన సిబ్బందితో కలిసి మండల కేంద్రం చిలప్‌చెడ్ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో వెటర్నరీ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడితేనే బంగారు భవిష్యత్



విద్యార్థులతో ఎంఈఓ వెంకటేశం, ఉపాధ్యాయులు

పెద్దశంకరంపేట(మెదక్): విద్యార్థులు కష్టపడితేనే బంగారు భవిష్యత్ ఉంటుందని ఎంఈఓ వెంకటేశం అన్నారు. సోమవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలు, విద్యాబోధనపై వివరించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, ప్రసన్నకుమార్, సిద్ధిరాములు, చంద్రప్రకాష్, మారుతి, హన్మండ్లు, సంతోష్, దయానంద్, నాగవేణి, రాధిక, అశ్విని, రాణి, శోభారాణి తదితరులు ఉన్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యం

ఆస్పత్రికని వెళ్లి యువతి



రేవతి

శివ్వంపేట(నర్సాపూర్): యువతి అదృశ్యమైన ఘటన మండలంలోని దొంతి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ మధుకర్‌రెడ్డి కథనం మేరకు.. గ్రామానికి చెందిన గుర్రం రేవతి తల్లిదండ్రులు చిన్నతనంలో చనిపోవడంతో పెద్దమ్మ గుర్రపు లక్ష్మి దగ్గర ఉంటుంది. రేవతికి పెళ్లి చేసేందుకు కుటుంబ సభ్యులు సంబంధాలు చూస్తున్నారు. 19న తనకు అనారోగ్యంగా ఉందని తూప్రాన్ ఆస్పత్రిలో చూయించుకుంటానని ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం కుటుంబీకుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇంటి నుంచి వెళ్లి వ్యక్తి

చేగుంట(తూప్రాన్): ఇంటి నుంచి వెళ్లి వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి కథనం మేరకు.. మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన మాందపురం కృష్టారెడ్డి 1న ఇంట్లోంచి వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో మాందపురం శోభ సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అప్రమత్తంగా ఉండాలి

పెద్దశంకరంపేట(మెదక్): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ శంకర్ అన్నారు. సోమవారం పెద్దశంకరంపేటలో ప్రజలకు సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. ఆన్‌లైన్‌లో వివిధ రకాల యాడ్స్, బెట్టింగ్‌ల జోలికి వెళ్లొద్దని, బ్యాంకుల వద్ద తమ వివరాలను ఇతరులకు చెప్పొద్దని సూచించారు.

నేడు భూభారతిపై అవగాహన

కంగ్టి(నారాయణఖేడ్): భూభారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించేందుకు మంగళవారం సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ భాస్కర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని తడ్కల్ దేవి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే సదస్సుకు జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్, ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, కలెక్టర్ వల్లూరు క్రాంతి, జిల్లా అదనపు కలెక్టర్ ఆర్‌డీ మాధురి, ఆర్డీఓ అశోక్ చక్రవర్తి రెవెన్యూ సిబ్బంది పాల్గొననున్నారు.

గుంతలకే పరిమితమైన పీహెచ్‌సీ

- మంత్రి ఆదేశాలు పట్టించుకోని అధికారులు, కాంట్రాక్టర్
- నెల రోజులుగా బెస్మెంట్ గుంతలు తీసి వదిలేసిన వైనం



ముస్లాపూర్‌లో ఆరోగ్య ఉపకేంద్ర భవన నిర్మాణం

అల్లాదుర్గం(మెదక్): ఆరోగ్య ఉప కేంద్రం భవన నిర్మాణానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ నిధులు మంజూరు చేశారు. భవనం వెంటనే నిర్మించి పేదలకు వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించినా.. పనులు మాత్రం గుంతలకే పరిమితమైంది. కాంట్రాక్టర్ బెస్మెంట్ గుంతలు తీసి, వదిలేసిన సంఘటన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి నియోజకవర్గం అల్లాదుర్గం మండలం ముస్లాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ముస్లాపూర్ ఆరోగ్య ఉప కేంద్ర భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేసింది. ఈ భవన నిర్మాణానికి మార్చి 15న మంత్రి దామోదర్ ఆదేశాలతో స్థానికుల నాయకులు శంకుస్థాపన చేశారు. నెల రోజులు గడిచినా.. భవన నిర్మాణం మాత్రం బెస్మెంట్ గుంతలకే పరిమితమైందని, కాంట్రాక్టర్ అటూవైపు కన్నెత్తి చూడటం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం అద్దె భవనంలో ఆరోగ్య ఉపకేంద్రం కొనసాగుతుందని, పేద రోగులకు సరైన వైద్యం అందడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరోగ్య ఉప కేంద్ర దుస్థితిని మంత్రి దామోదర్ దృష్టికి తీసుకెళ్తే.. నిధులు మంజూరు చేసినట్లు స్థానిక కాంగ్రెస్ నాయకులు చెప్పారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు ముందుకు సాగడం లేదని, సంబంధిత అధికారులు సహితం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే కాంట్రాక్టర్ గతంలో అల్లాదుర్గం పీహెచ్‌సీలో మరమ్మతు పనులు నాణ్యత లేకుండా చేపట్టినట్లు ఆరోపణలు ఉన్నాయని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. అధికారులు స్పందించి, వెంటనే ఆరోగ్య ఉప కేంద్రం భవనం నిర్మించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

నేడు భూ భారతిపై అవగాహన

హాజరు కానున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

రేగోడ్(మెదక్): మండల కేంద్రం రేగోడ్‌లోని రైతు వేదిక కార్యాలయంలో నేడు మంగళవారం ఉదయం 11 గంటలకు భూ భారతిపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు ఆర్ఐ ఫెరోజ్ సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ రాహుల్‌రాజ్ హాజరు కానున్నారని చెప్పారు. ఈ అవగాహన సమావేశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు.

సీఆర్‌పీల ఎంపికకు రాతపరీక్ష

నర్సాపూర్: మండల సమాఖ్యలో పని చేసేందుకు సీఆర్‌పీల ఎంపిక కోసం సోమవారం స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో అభ్యర్థులకు రాత పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రాజెక్టు మేనేజర్ మోహన్ మాట్లాడుతూ.. నర్సాపూర్, కౌడిపల్లి, చిలప్‌చెడ్ మండలాల్లో పని చేసేందుకు సీఆర్‌పీల ఎంపిక నిమిత్తం రాత పరీక్ష, యాక్టివిటీ ద్వారా అర్హత పరీక్ష నిర్వహించామని చెప్పారు. రాష్ట్ర కార్యాలయం నుంచి వచ్చిన ప్రతినిధులు అరుణ్ తదితరులు పర్యవేక్షించారని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఏపీఎం గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు గడ్డి ట్రాక్టర్ దగ్ధం



ప్రమాదంలో కాలిపోతున్న గడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): చిన్నశంకరంపేట్ మండలం జంగరాయి నుంచి గడ్డితో వెళ్తున్న ట్రాక్టర్ అగ్ని ప్రమాదంలో కాలి పోయింది. మండలంలోని ఎం.జలాల్‌పూర్ గ్రామానికి చెందిన ఎల్లాగౌడ్ తన ట్రాక్టర్‌తో గడ్డి తరలిస్తున్న నేపథ్యంలో వెల్దుర్తి మండలం ఉప్పులింగాపూర్ శివారులో విద్యుత్ తీగకు గడ్డి తగలడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కాగా ట్రాక్టర్ డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి రోడ్డు పక్కనే ట్రాక్టర్ నిలిపివేసి ఇంజన్ తప్పించడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ట్రాక్టర్‌పై పరిమితికి మించి గడ్డి తరలించడం వల్ల ఈ ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు వాపోతున్నారు. అగ్ని ప్రమాదంలో సుమారు రూ.50 వేలు నష్టం జరిగిందని బాధితులు వాపోయారు.

రజతోత్సవ సభకు తరలిరండి

ఎమ్మెల్యే సునీతారెడ్డి



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): వరంగల్ జిల్లాలో ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ వార్షికోత్సవ సభను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే సునితారెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు సభకు జన సమీకరణపై సోమవారం వెల్దుర్తి మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి, చర్చించారు. అనంతరం చలో వరంగల్ సభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రమేష్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కృష్ణాగౌడ్, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని ముట్రాజ్‌పల్లి కిష్టరేగడితండా, తాళ్లగడ్డతండా, భుజిరంపేట ఎర్రమట్టితండాకు రూ 7.4కోట్లతో నిర్మించే బీటీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే సునీతారెడ్డి భూమిపూజ చేశారు.

ప్రజలు కేసీఆర్‌ను కోరుకుంటున్నారు

– ఎమ్మెల్సీ యాదవరెడ్డి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): తెలంగాణ ప్రజలు కేసీఆర్‌ను సీఎంగా కోరుకుంటున్నారని ఎమ్మెల్సీ యాదవరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో రాష్ట్ర నాయకులు వంటేరు ప్రతాప్‌రెడ్డి, శేఖర్‌గౌడ్‌తో కలిసి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ తెలంగాణ కోసం స్థాపించిన బీఆర్ఎస్ పార్టీ ఏర్పడి 25 సంవత్సరాలు అవుతున్నందున, ఈనెల 27న వరంగల్‌లో రజతోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌గౌడ్, రవి, మొంగ్యనాయక్, రేణుకుమార్, రాహుల్‌రెడ్డి, శ్రీరామ్, రతన్‌లాల్, మాధవరెడ్డి, ఆంజనేయులు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించండి

ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ స్వరూప రాణి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ స్వరూపరాణి

చిన్నశంకరంపేట(మెదక్): పిల్లలకు పౌష్టికాహారం అందించాలని రామాయంపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ స్వరూపరాణి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఐకేపీ భవనంలో ఏర్పాటు చేసిన పోషణ్ పక్వాడ, బేటీ బచావో – బేటీ పడావో మండల్ లేవల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలబాలికల సంరక్షణకు ప్రభుత్వ చేపడుతున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు పౌష్టికాహారం, సంరక్షణకు సహకారం అందించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల సంరక్షణకు అందిస్తున్న సహకారంపై వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మన్నన్, ఎంపీడీఓ దామోదర్, సీహెచ్ఓ యాదగిరిరావు, ఐకేపీ ఏపీఎం లక్ష్మీనారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ, సంధ్య పాల్గొన్నారు.

ఎర్రమట్టితండాలో నీటి సమస్య



నిరసన వ్యక్తం చేస్తున్న తండామహిళలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని భుజిరంపేట పంచాయతీ పరిధిలోని ఎర్రమట్టితండాలో మంచి నీటి సమస్య తీవ్రంగా ఉందని తండావాసులు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా తండావాసులు మాట్లాడుతూ.. తండాలో రెండు నెలలుగా నీటి సమస్య ఉండగా, ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. మిషన్‌భగీరథ నీరు రావడంలేదని దీంతో వ్యవసాయ బోర్లవద్ద నుంచి తెచ్చుకుంటున్నామని చెప్పారు. ప్రస్తుతం వరికోతల సీజన్ కావడంతో బోర్లు సైతం నడవడం లేదని, దీంతో సమస్య తీవ్రంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు.

అర్హులకు న్యాయం చేయండి



నిరసన తెలుపుతున్న బుడగ జంగాలు

మెదక్ కలెక్టరేట్: నిరుపేద బుడగ జంగాల ప్రజలకు భూములను కొంతమంది కబ్జా చేశారని, వాటిని వెంటనే తొలగించి అర్హులకు న్యాయం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పద్మ అన్నారు. సోమవారం బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అదనపు కలెక్టర్ నగేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బుడగ జంగాలకు ప్రభుత్వం కేటాయించిన భూములను బుడగ జంగాలకే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మల్లేశం, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సీహెచ్ గౌడయ్య, నాయకులు శంకర్, లలిత, మల్లేశం, నర్సింలు, పోచయ్య, శ్రీశైలం పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌పై ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను తొలగించి, తమ వాహనంలో తరలిస్తున్న మున్సిపల్ సిబ్బంది

నర్సాపూర్: మున్సిపాలిటీ పరిధిలోని జాతీయ రహదారి పక్కన నిర్మించిన ఫుట్‌పాత్‌పై ఉన్న ఆక్రమణలు సోమవారం తొలగించారు. మున్సిపల్ కమిషనర్ రామకృష్ణరావు ఆదేశాలతో ఆక్రమణలు తొలగించామని మున్సిపల్ టీపీఎస్ ప్రభాకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీ చెప్పారు. ఫుట్‌పాత్‌పైఏర్పాటుచేసిన దుకాణాలు, ఇతర సామాగ్రిని తొలగించి మున్సిపాలిటీ వాహనంలో తమకార్యాలయానికి తరలించామన్నారు.

సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి



నార్సింగి ఎంఈఓ మురళి మోహన్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): ఉపాధ్యాయ సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో మడూర్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం గోపాల్ పదవి విరమణ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సేవలు గొప్పవని, వారు పడే శ్రమ వర్ణించలేనిదన్నారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రాజ్ గోపాల్ గౌడ్, పోచయ్య, ఎంపీడీవో దామోదర్, తహసీల్దార్ మన్నన్, ఎంఈఓలు పుష్పవేణి యాదగిరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నార్సింగిలో...

నార్సింగి ఎంఈఓ మురళి మోహన్ సేవలు అభినందనీయమని డీఈవో రాధాకిషన్ అన్నారు. సోమవారం నార్సింగి జెడ్పీ పాఠశాలలో మురళి మోహన్ పదవి విరమణ సమావేశం నిర్వహించారు.

ప్రభుత్వ కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించండి

మెదక్ ఎమ్మెల్యే రోహిత్

హవేళిఘణాపూర్(మెదక్): రైతులకు మద్దతు ధర కోసం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని మెదక్ ఎమ్మెల్యే రోహిత్ అన్నారు. సోమవారం మండల కేంద్రం హవేళిఘణాపూర్, బోగుడభూపతిపూర్, శాలిపేట తదితర గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు. అనంతరం మండల పరిధిలోని శాలిపేటలో మినరల్‌వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు.

కోనాపూర్‌లో..

రామాయంపేట(మెదక్): మండలంలోని కోనాపూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సహకార సంఘం అధ్యక్షురాలు విజయలక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘం డైరెక్టర్లు సిద్ధరాంలు, నందు మహిపాల్‌రెడ్డి, రాములు పాల్గొన్నారు.

పిల్లుట్లలో..

శివ్వంపేట(నర్సాపూర్): రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి, వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని అల్లీపూర్, కొత్తపేట, పిల్లుట్ల, లింగోజిగూడ గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ మధు, బీఆర్ఎస్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గంగాధర్, పూల్‌సింగ్, శ్రీనివాస్, అంజిరెడ్డి, పెంటాగౌడ్, రాఘవరెడ్డి, గోపాల్ తదితరులు ఉన్నారు.

రేగోడ్(మెదక్): మండల కేంద్రం రేగోడ్, చౌదర్‌పల్లి, కొత్వాన్‌పల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీసీ సభ్యుడు ఎం.కిషన్ ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దత్తరెడ్డి, ఎంపీడీఓ సీతారావమ్మ, ఎస్ఐ పోచయ్య, ఏఓ జావిద్, ఆర్ఐ ఫెరోజ్, ఐకేపీ ఏపీఎం సంగీత, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఎస్.దిగంబర్‌రావు,వట్‌పల్లి ఏఎంసీ డైరెక్టర్ శ్రీధర్‌గుప్తా పాల్గొన్నారు.



తూప్రాన్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ బాలకృష్ణరెడ్డి

రైతులకు బోనస్ విడుదల చేయాలి

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని అప్పాజీపల్లి, పోతంశెట్టిపల్లి, మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రారంభించారు. ఆమె వెంట పీఏసీఎస్ చైర్మన్ మనోహర్, ఏవో శ్వేతాకుమారి, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్రంగౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గౌరీ శంకర్, నాయకులు, సీఈఓ కృష్ణ పాల్గొన్నారు.

తూకం ప్రారంభించాలి

కౌడిపల్లి(నర్సాపూర్): అకాల వర్షాలతో రైతులు నష్టపోతున్నారని త్వరగా తూకం వేయాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. మండలంలోని కూకుట్లపల్లిలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రభుత్వం అధికారులపై ఒత్తిడి తెచ్చి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినా.. ఇప్పటివరకు ఒక్కబస్తా తూకం వేయలేదని ఎమ్మెల్యే విమర్శించారు. కార్యక్రమంలో ఆర్ అండ్‌బీ డీఈ నాగరాజు, తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీఓ కలీముల్ల, ఏపీఎం సంగమేశ్వర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రామాగౌడ్, మండల ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, మాజీ సర్పంచ్‌లు ఎల్లం, శ్యాంసుందర్‌రావు, కాంతారావు, కిషోర్‌గౌడ్, సాయాగౌడ్, సంజీవ్, బట్టయ్య, నాయకులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి

చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా కొనుగోళ్లు జరపాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. సోమవారం ఆమె చిట్కుల్, చండూర్, చిలప్‌చెడ్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, దుర్గారెడ్డి, గోపాల్‌రెడ్డి, ఖాసీం, కిషన్‌రెడ్డి, సుధాకర్, మండల వ్యవసాయాధికారి రాజశేఖర్‌గౌడ్, ఇన్‌చార్జి తహసీల్దార్ సింధూజ, ఎంపీడీఓ ఆనంద్, ఏఈఓ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని దండుపల్లి వద్ద పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తూప్రాన్ పీఏసీఎస్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు మల్లారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ బోరుమోటార్ అందజేత

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని ఖాజాపూర్ గ్రామంలో తాగునీటి ఎద్దడి తీర్చేందుకు స్థానిక కావేరి స్టీల్ పరిశ్రమ బోరుమోటార్ అందించారు. పాఠశాల సమీపంలో బోరుమోటార్ పాడైపోయిన విషయం గ్రామ పంచాయతీ సిబ్బంది పరిశ్రమ యజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో 5హెచ్‌పీ మోటార్ అందించారు.

◆ సంప్రదాయాలను పాటించాలి

శివ్వంపేట(నర్సాపూర్): పూర్వపు సంప్రదాయాలను పాటించాల్సిన అవసరం ఉందని ప్రసాద్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శివకుమార్‌గౌడ్ అన్నారు. సోమవారం శివ్వంపేటకు చెందిన భజన మండలి బృందానికి తన సొంత నిధులతో భజన సామగ్రి అందజేశారు. గూడూర్‌లో నిర్మిస్తున్న గురుపీఠంలో సాయిబాబా, దత్తాత్రేయ విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం త్వరలోనే నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గురుపీఠం సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, భిక్షపతియాదవ్, వెంకటేష్, భాస్కర్, చిన్నరెడ్డి, సత్యనారాయణ ఉన్నారు.

◆ పీహెచ్‌సీలో చలో వరంగల్ రాతలు

నర్సాపూర్ రూరల్: మండల పరిధిలోని లింగాపూర్‌లోని ప్రభుత్వ ఆరోగ్య ఉపకేంద్రం గోడలపై బీఆర్ఎస్ నాయకులు ఏప్రిల్ 27న చలో వరంగల్, కేసీఆర్ జిందాబాద్ అంటూ గొడవలపై రాతలు రాశారు. దీంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ నాయకులు ప్రభుత్వ భవనాల గోడలపై రాసిన రాతలను వెంటనే తొలగించాలని కోరుతున్నారు.

◆ క్షీరాభిషేకం

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలంలోని వల్లూర్‌లో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల మొదటి దశ బిల్లులు మంజూరు కావడంతో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి లబ్ధిదారులు క్షీరాభిషేకం చేశారు.

◆ అభివృద్ధిపై చర్చకు సిద్ధం



శివ్వంపేట(నర్సాపూర్): గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో మండలంలో జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణగౌడ్, మాజీ జెడ్పీటీసీ మహేశ్‌గుప్తా అన్నారు. సోమవారం శివ్వంపేటలో వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేవని కాంగ్రెస్ నాయకులు చేసిన ఆరోపణలను ఖండించారు. కావాలనే ఉద్దేశ పూర్వకంగా బీఆర్ఎస్‌కు చెందిన యువ నాయకులపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మీనర్సయ్య, అశోక్, కొండల్, గొండస్వామి, నాగరాజు, త్రినేష్‌గౌడ్ రవినాయక్, బలరాం, తదితరులు ఉన్నారు.

◆ రుణమాఫీ చేయాలని ఫిర్యాదు

కౌడిపల్లి(నర్సాపూర్): రుణమాఫీ కాని రైతులకు వెంటనే మాఫీ చేయాలని వెల్మకన్న మాజీ సర్పంచ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్ గ్రామ రైతులతో కలిసి మెదక్ ప్రజావాణిలో సోమవారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ. 2లక్షలు రుణమాఫీ చేయాలన్నారు. ప్రభుత్వం రుణమాఫీ చేసినట్లు చెప్తున్నా.. వెల్మకన్నలో చాలా మంది రైతులకు మాఫీ కాలేదన్నారు. గ్రామానికి చెందిన రైతులు పోచయ్య, కిషన్, మరియమ్మ, శాకమ్మ, సుశీల తదితరులకు రుణమాఫీ కాలేదని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

◆ చెక్కుల పంపిణీ

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పిల్లుట్ల గ్రామంలో పలువురి లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సోమవారం బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి సహకారంతో చెక్కులు మంజూరైనట్లు బీఆర్ఎస్ నాయకులు చింత స్వామి, దామోదర్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్, వెంకటేష్, గణేశ్ అన్నారు.

◆ కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

రామాయంపేట(మెదక్): పోలీసుల దాడిలో గాయపడ్డట్లు ప్రచారం జరుగుతున్న పట్టణానికి చెందిన కార్యకర్త మ్యాకల నర్సింగరావును మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి పరామర్శించారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన బాధితుడితో మాట్లాడి వివరాలు తెలుసుకొన్నారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టు పెట్టినందుకు పోలీసులు తనను ఇంటి నుంచి తీసుకెళ్లి ఇష్టం వచ్చినట్లు కొట్టారన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.